# 3. నులక మంచం

ఆ నదిలో నీరు, శాస్త్రీయ సంగీతం పాడుతూ, శివతాండవం చేస్తూ ప్రవహి స్తోంది.

అప్పుడే లేచిన సూర్యుడు, ఆ సంగీతాన్ని వింటున్నాడో - లేదో - తెలీదు గానీ, ఆ శివతాండవాన్ని చూస్తున్నాడు.

అక్కడికి దగ్గరగా, పువ్వుల్తో - కాయల్తో భారంగా వున్న మామిడి తోట వుంది.

ఆ నది ఒడ్డుకి దగ్గరగా, పులి కోనేరుంది. ఆ కోనేటి ఒడ్డున, పోటీకి నిలబడ్డ అందాల తారల్లా కొబ్బరి చెట్లు వున్నాయ్.

సూర్యుడు లేచి రెండు గంటలయింది. ఆ రాజు లేచి, మూడు గంటలయింది.

అప్పుడా రాజు - ఆ కోనేర్లో జల క్రీడలాడుతున్నాడు. ఆ కోనేర్లో అక్కడే సరోజ నగ్నంగా జలకాలాడుతోంది. ఆ రాజు ఆ సరోజను చేతుల్లోకి తీసుకుని, సూర్యుడికి ఎదురుగా ముద్దాడాడు.

అప్పుడు సూర్యుడు వుండడం వల్ల చంద్రుడు లేడు.

చంద్రుడే వుంటే - ఓ యబ్బో - రూలు ప్రకారం - సిగ్గు పడి, మేఘాల చాటున దాగుండి, దొంగ దొంగ చూపులు చూసేవాడు!

ఆ రాజు అప్పల రాజు! అతడు అష్టమహిషాధిపతి! అంతే గాకుండా,ఏక మేషాధిపతి.! ఆ గేదెలు ఆ నదిలో ఈదుతున్నాయ్. ఆ మేక, బతికుంటే బలుసాకైనా తిని, బతకొచ్చని అనుకుని, ఆ తోటలోకి పోకుండా, పక్కనున్న బలుసాకులు తింటోంది.

ఆ రాజు గోచీ పెట్టుకున్నాడు. అతడి వయస్సు పన్నెండేళ్లుండొచ్చు. అతడు గిరిజారావు గారి గేదెల్ని కాస్తూ వుంటాడు. ఆ మేక మాత్రం అప్పలరాజుదే.

అప్పల రాజు అమావాస్య చీకట్లా నల్లగా వుంటాడు. తిండి లేని అప్పల్రాజు, చిక్కి శల్యంగా వుంటాడు. గుడ్డ ల్లేని అప్పల్రాజు, తిండి లేని నల్ల మేకలా వుంటాడు. అంతే గాకుండా, అతడు ఆకలిగా, శోకంగా కనబడతాడు.

అతడు ఆ నది ఒడ్డున కూర్చున్నాడు. శాస్త్రీయ సంగీతం వినడం, అప్పల్రాజుకి తెలీదు. అలాగే, శివతాండవం చూడ్డం కూడా అతడికి తెలీదు. అంచాత, ఆ గేదెల మీద వాల్తూ, ఎగురుతున్న కాకుల్ని చూస్తూ, కూర్చున్నాడు.

అంతలో ఆ మేక పచ్చని పొదల్లో తిరుగుతూ, అతడికి కనబడలేదు. అంచాత ముందుకు నడిచాడు. అప్పుడతడు ఆ తోటలో ఒక కారుని చూసాడు.

❋ ❋ ❋

ఆ కారు సుందర్రావుది. ఆ తోట గిరిజారావు గారిది. సుందర్రావు, గిరిజారావు గారి అబ్బాయి.

ఆ సుందర్రావు, ఒక సుందరితో ఆ కార్లో వచ్చాడు.

అతడు పొడవుగా, తెల్లగా, నున్నంగా వున్నాడు. పులి మచ్చల కోటులో- పులిచార్ల పంట్లాంలో – అతడు పులిలా, హుందాగా వున్నాడు.

నల్ల త్రాచు చర్మంతో కుట్టిన అతని జోళ్ళు, కాటు వేసే పాముల్లా వున్నాయ్.

అతడు ఇంటరు చదువుతున్నప్పుడు, ఇందిరను ప్రేమించాడు. బియ్యే చదువు తున్నప్పుడు భవానిని ప్రేమించాడు. ఎమ్మే చదువుతున్నప్పుడు ఎలిజబెత్‌ని ప్రేమించాడు.

పి.హెచ్.డి. చేస్తున్నప్పుడు, ప్రతిభను ప్రేమించాడు.

డాక్టరు రావు అయ్యాక, ప్రేమించడం మానేసి, ధనలక్ష్మిని పెళ్లాడాడు.

తర్వాత - ధనార్జన అతని జీవితమయింది. వ్యాపారం ప్రేమ అయింది. ఆడవాళ్ళతో ఆడుకోడం హాబీ అయింది.

ఆ రోజున - హాబీగా - ఆడు కోడం కోసం - పార్వతిని పట్టుకొచ్చాడు.

అయితే - పార్వతికి అది హాబీ కాదు!

❋ ❋ ❋

అయితే - పార్వతి -

యస్సెస్సల్సీ చదువుతున్నప్పుడు, అయ్యేయస్, ఆవాలనుకుంది. పి.యు.సి చదువుతున్నప్పుడు, పెయింటింగ్ నేర్చుకుంది. బియ్యే చదువుతున్నప్పుడు - భరత నాట్యం నేర్చుకుంది. ఎమ్మే లో చేరాక, సంగీతం మొదలెట్టింది.

ఆ సంగీతం మాస్టరికి, కళ్లీ చొక్కా వుంది. గిరజాల జుట్టు వుంది. ఆడ మొహం వుంది. సంగీతం వుంది. సంగీతంలో తన్మయత్వం చెందించే తపస్సు వుంది.

అతడు ఆమెను మెదటిసారిగా కాటు వేసాడు.!

అ తర్వాత--

పెళ్లాడుతానని ఒక డబ్బు గల యువకుడూ –

ఉద్యోగం ఇస్తానని ఒక ఆఫీసరూ –

వ్యాపారం చేయిస్తానని ఒక వ్యాపారస్తుడూ –

లా చదివించి, ప్రాక్టీసు పెట్టిస్తానని ఓ లాయరూ –

అద్దె లేకుండా ఇల్లు ఇస్తానని ఒక హౌస్ ఒనరూ –

అలా అలా – కొందరు కొందరు – వరస వరసగా – ఆమెను దగా చేసారు!

అయితే – అప్పుడు - నలభై అయిదేళ్ల వరకూ పెళ్లి చేసుకోకుండా వుండిపోయిన, గుమస్తా కామేశం ఆమెను దగా చేయకుండా పెళ్లి చేసుకున్నాడు.

'నా ఆదాయం – మందుకీ – ఆడదాన్ని పోషించడానికీ - రెండింటికీ చాల్దు! ఇందులో ఏదో ఒహటే ఎన్నుకోవాలి! ఇందులో ఏది ఎక్కువ సుఖమిస్తుంది! ఏది ఎక్కువ మధురంగా వుంటుంది!' అని కామేశం, గుమస్తా లెక్కలు వేసి వేసి, మందుని ఎన్ను కున్నాడు.!

అయితే, సుందర్రావు అతడి దగ్గర స్నేహితుడు. 'ఆడదాన్తో జీవితం రుచి చూడకుండా, చచ్చి పోవడం – ఆ జీవితం జీవితం కాదు ' అని సుందర్రావు చెప్పి, పార్వతిని పెళ్లి చేసుకోమని కూడా చెప్పాడు. కామేశం ఆమెను అలా పెళ్లి చేసుకున్నాడు.

అయితే - కామేశం ఆ తర్వాత ఎంతో కాలం బతక లేదు.

'నేను ఒకటే గానీ– రెండు ఒద్దన్నాను! నీ మాట విని, నేను రెండోది కూడా ఒప్పుకున్నాను! నేను మొదటి దాన్ని ప్రేమించి నంతగా, రెండోది ప్రేమించలేక పోయాను! నేను మొదటి దాన్తో చచ్చి పోతున్నాను! రెండోది నీకు అప్పగిస్తున్నాను! ఆమెను నేను కూ డా దగా చేసాను ' అని నవ్వుతూ చెప్పి , కామేశం చచ్చి పోయాడు.

* * *

ఆ తోటలో – గున్న మామిడి చెట్టు కింద – సుందర్రావూ, పార్వతీ, దగ్గర దగ్గరగా కూర్చున్నారు. ఆమె వెన్నెల పారలాంటి తెల్ల చీర కట్టుకుంది. ఆ చీరలో ఆమె – వాడిపోయిన కలువ పువ్వులా వుంది. మబ్బు పారలాంటి చీర కట్టుకుంటే – ఆమె కన్నీటి మేఘంలా వుంటుంది! ఆమె సుందర్రావుకి పన్నీటి జల్లులా వుంటుంది!

ఆమె జీవితంలో బాగా దగా పడింది. ఆమె మానసికంగా, ఎంతో దెబ్బ తింది. ఆమె జీవితం లో ఎంతో నలిగి పోయింది. ఆమె నిరాశగా వుంది. ఆమె బతకడం కోసం మాత్రమే నవ్వుతుంది.

ఆ వేళ ఎండ వేడిగా, నిప్పుల్లా మండుతోంది.

ఆమె అలిసి పోయి, స్పృహ తప్పి పడి పోయింది. సుందర్రావు ఏమీ తోచక, నిటారుగా

నిలబడ్డాడు. అతడు ' నీళ్ళు – నీళ్ళు ' అని అరిచాడు! పిలుపు విని నీళ్ల రాలేదు!

బుఱ్ఱ పైకెత్తి, కొబ్బరి కాయల్ని చూసాడు. 'కొబ్బరి నీళ్ళు - కొబ్బరి నీళ్ళు' అని మళ్లీ అరిచాడు!

ఆ కొబ్బరి కాయలు ఆ పిలుపు విని కింద పడలేదు! ' ఏం చెయాలి? ఏం చెయాలి? ' అని నాలుగు వేపులా చూస్తున్నాడు.

అప్పుల్రాజుస్పృహ తప్పి పడివున్న ఆమెను చూసాడు. దిక్కులు చూస్తున్న అతణ్ని చూసాడు.

వెంటనే బొరిగెతో లేత తాటాకు కొట్టాడు. చేదలా మడిచాడు. ఆ చేదతో నీళ్ళు తెచ్చాడు. ఆమె మొహం మీద జల్లాడు. వెంటనే కొబ్బరి చెట్టు ఎక్కాడు. రెండు కాయలు దించాడు. ఆ కొబ్బరి బొండాలు నరికి, ఆమెకు ఆ నీళ్ళు ఇచ్చాడు.

ఆమె తేరుకుంది. సుందర్రావు వెంటనే ఆమెను తీసుకుని, కార్లో వెళ్లి పోయాడు.

* * *

అప్పుల్రాజు కొబ్బరి చెట్టు దిగుతున్నప్పుడు, కొంచెం కిందికి జారాడు. గుండెల మీద చర్మం, చీరుకు పోయి, రక్తం చిమ్ముతోంది.

ఆ గుండెలు కడుక్కోడానికి కోనేర్లో దిగాడు.

ముందుకి వంగి, గుండెలు కడుక్కుంటున్నాడు.

వెనక నుంచి, ఎవడో వచ్చి, చెయి పట్టుకు లాగాడు. అతడు తుళ్లి పడి, పడిపోయాడు.

అతడు గిరిజారావు. అతడి చేతిలో నిటారుగా నిలబడ్డ నల్ల త్రాచులాంటి చేతి కఱ్ఱ వుంది. అతడు నిప్పుల్లా కళ్లు ఎఱ్ఱ జేసాడు.

'ఓరి ఎదవన్నర ఎదవా! నీ అబ్బ సొమ్మనుకున్నావేటి? నీ తాత సొమ్మనుకున్నావేటి? ఆ కొబ్బరి బొండాల్ని కొట్టుకు దినేసినావు? ఆ కొబ్బరి బొండం కింద పడ్డట్టు, నీ బుఱ్ఱ ఇప్పుడు రాలి పడి పోద్ది!' అని ఆ కఱ్ఱతో బాదాడు.

' అమ్మగోరు పడిపోనారు! . . సినబాబు సూసినాడు ! .. నాను ముట్టనేదు ! ... . నాను దిననేదు! .. . అని అప్పుల్రాజు, ఏడుస్తూ, బెదురు బెదురుగా చెప్పాడు.

' నోర్మూసుకోరా ఎదవా! నీకు దొంగ తనం బాగొచ్చింది! ఆబద్ధం సెప్పడం రానేదు! అబద్ధం సెబితే, నిజం కంటే నిజంగుండాలిరా ! సినబాబు ఏపారం కోసం పట్నం ఎల్లినాడు! కోడలు ఇంట్లోనే వుంది! మరి ఒవురొచ్చి నార్రా, ఎదవా!' అని గిరిజారావు, ధబాయించి, మరో రెండు దెబ్బలు వేసాడు. జుత్తు పట్టుకు లాగి, వెనక్కి తోసేసాడు. అప్పుల్రాజు, ఆ వూపు కాసుకోలేక గులక రాళ్లల్లో పడ్డాడు.

గిరిజారావు పెదపాలికాపుని కేక వేసాడు.

'ఈణ్ని ఈళ్ల అయ్య కాడికి అట్టుకెల్లు! జుత్తొట్టుకు ఈడ్చు కెల్లు! మల్లీ దొంగ తనం చేస్తే, బుఱ్ఱ ఎగిరి పోద్దని సెప్పు!' అని అటకాయించి, ఆజ్ఞాపించాడు.

ఆ పెద పాలికాపు, అప్పల్రాజుజుత్తు పట్టుకున్నాడు. గిరిజారావు మెప్పు కోసం గుంజాడు. వాణ్ని ఈడ్చి కెళ్లి, గిరిజారావు చెప్పినట్లు ,చెప్పాడు.

'ఏట్రా, ఆ దగుల్బాజీ పని! మనకి కూడుకి నోటుంది! నీతికి నోటు నేదు.! ' అని, అప్పల్రాజు తల్లి, బరువైన చందల్తో, నెత్తి మీద మొత్తింది.

అప్పుడే ఎడ్ల బండి దిగిన, అప్పల్రాజు తండ్రి, అది విన్నాడు. కోపంతో కంపించి పోయాడు.

'ఏట్రా, దొంగనాకొడకా! దొంగతనం మన ఇంటా –ఒంటా నేదురా! అయిసేసే పెద్దోరంతా– ఆరంతా - ఏరు! మనం సెవట గక్కి బతికే వోళ్లం రా! దొంగనా కొడకా! ' అని అతడు అరుస్తూ, చేతిలోని కొరడా కఱ్ఱని అప్పల్రాజు మీదకు విసిరాడు. అప్పల్రాజు , అది చూసి, నేల మీద వాలి పోడం వల్ల, గురి తప్పి, పక్కకు పోయింది.

అప్పల్రాజు జల జలా కన్నీరు కారుస్తూ, కుక్కి నులక మంచం మీద వాలి పోయాడు.

' ఆళ్లు దొంగోళ్లన్న మాట! అందుకే నన్నుగూడ దొంగను కున్నారు! ఆళ్లని ఒగ్గుతా నేటి?' అని తల పైకెత్తి కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

(పాలి కేక - సచిత్ర వార పత్రిక – 25-09-1970)